క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్‌తీగలు


ఇంటిపై తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

పాణ్యం: స్థానిక మేకలబండలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఇళ్లపై తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్యను అధికారులకు పదేపదే చెప్పినా పట్టించుకోవడం లేదని గృహ నిర్మాణ లబ్ధిదారులు వాపోతున్నారు. అలాగే ఇంటి నిర్మాణాలకు క్యూరింగ్ చేసే సమయంలో తీగలపై నీళ్ల పడతాయనే భయంతో క్యూరింగ్ చేయడం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

మూల పెద్దమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: మండల కేంద్రంలో వెలసిన మూల పెద్దమ్మ వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వందలాది మంది భక్తులు ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేషపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు చైర్మన్ తలారి చిన్నన్న, ఈఓ మోహన్ వెల్లడించారు.

నేటి నుంచి సాయినాథుని ఉత్సవాలు

కోడుమూరు రూరల్: మండలంలోని పులకుర్తి గ్రామంలో వెలసిన శ్రీసాయినాథుడి 2వ మహా రథోత్సవ ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలియజేశారు. వేడుకల్లో భాగంగా 24న ప్రభోత్సవం, 25న సాయంత్రం రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు

26న బండలాగుడు పోటీలు

వేడుకల సందర్భంగా ఈనెల 26న పాలపండ్ల ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభ రాజముల యజమానులకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున దాతల సహకారంతో అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం


ధనుంజయ(ఫైల్)

గూడూరు: విద్యుత్ షాక్‌తో పట్టణానికి చెందిన గొల్ల ధనుంజయ (36) ఆదివారం మృతి చెందాడు. పత్తి విత్తనాలు నాటడానికి పొలం వెళ్లాడు. నీరు పెట్టుకోవడానికి విద్యుత్ స్టార్టర్ ఆన్ చేయగా ప్రమాదవశాత్తు షాక్ కొట్టింది. గమనించిన చుట్టుపక్కల వారు ఆసుపత్రికి తీసుకెళ్లగా గొల్ల ధనుంజయ అప్పటికే మృతి చెందాడు. మృతిని తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కోడె గిత్తలకు సాధన


కొడె దూడలతో సాధన చేయిస్తున్న దృశ్యం

కల్లూరు: వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు కోడె దూడలను దృఢంగా తీర్చిదిద్దేందుకు వాటి చిన్న వయస్సులో సాధన చేయిస్తారు. పెద్దకొట్టాలకు చెందిన బన్నూరు మౌలాలి తన 13 నెలల వయసున్న కొడేదూడలను వ్యవసాయ పనుల నిమిత్తం సాధన చేయిస్తూ 'సాక్షి' కెమెరాకు చిక్కారు.

నేడు రాయలసీమ కర్తవ్య దీక్ష

కర్నూలు కల్చరల్: సిద్దేశ్వరం–సోమశిల ప్రాజెక్ట్ వద్ద బ్రిడ్జి కం బ్యారేజీను నిర్మించాలని, రాయలసీమ ప్రాంత సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ ప్రాజెక్టల నిర్మాణాలను పూర్తి చేయాలనే ప్రధాన డిమాండ్లతో రాయలసీమ మేధావుల స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్టీబీసీ కళాశాల మైదానంలో రాయలసీమ కర్తవ్య దీక్ష చేపడుతున్నట్లు రాయలసీమ కర్తవ్య దీక్ష కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దీక్షకు మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి, మాజీ మంత్రులు మైసూరా రెడ్డి, ఆదినారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసి రెడ్డి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, ప్రజా గాయకుడు గద్దర్ తదితర మేధావులు, రాజకీయ పార్టీల నాయకులు హాజరై మద్దతు ప్రకటించనున్నారన్నారు.

ఉత్తమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పంచాయతీగా పాణ్యం



పాణ్యం గ్రామ పంచాయతీ కార్యాలయం

పాణ్యం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయి. ఏటా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని తొమ్మిది విభాగాల్లో ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసి ఆయా జిల్లాల కలెక్టర్ల చేతుల మీదుగా అవార్డులను అందిస్తారు. పంచాయతీ తరపున ప్రథమ పౌరుడిగా ఎన్నికైన సర్పంచ్‌కు అవార్డు అందిస్తారు. నంద్యాల జిల్లా ఆవిర్భవించిన తర్వాత మొదటిసారిగా అవార్డులను ప్రకటించగా పాణ్యం గ్రామ పంచాయతీ ×సెల్ఫ్ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో అవార్డుకు ఎంపికైంది. దీంతో నంద్యాల జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సోమవారం గ్రామ పంచాయతీ సర్పంచ్ మేకల పల్లవి అవార్డు అందుకోనున్నారు. పాణ్యం మేజర్ గ్రామ పంచాయతీలో 4,200 గృహాలు, 14 వేలకు పైగా జనాభా, 10,261 మంది ఓటర్లు ఉన్నారు. ఈ పంచాయతీలో అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని వర్మీకంపోస్ట్ తయారీ యూనిట్‌లలో సఫిషియంట్‌గా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉండడంతో పాటు నిర్వహణ సమర్థవంతంగా ఉండడంతో అధికారులు అవార్డుకు ఎంపిక చేశారు. పంచాయతీ అవార్డుకు ఎంపిక కావడంపై అధికారులు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు అవార్డుల ప్రదానం

ఆయా విభాగాల్లో ఎంపికైన గ్రామ పంచాయతీల సర్పంచ్, కార్యదర్శులకు సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా అవార్డులను అందించనున్నారు. అలాగే దేశంలోని పంచాయతీల సర్పంచ్‌లతో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగించనున్నారు. ఈ ప్రసంగాన్ని అన్ని పంచాయతీల్లో లైవ్‌లో సర్పంచ్‌లు వీక్షించనున్నారు.

వివిధ విభాగాల్లో అవార్డులకు ఎంపికైన గ్రామ పంచాయతీలు

విభాగం పేరు	పంచాయతీ పేరు
1.పావర్టీ ఫ్రీఅండ్ ఎన్‌హాండ్స్ లైవ్ హుడ్ పంచాయతీలు	చాగలమర్రి, టూరాపురం, ఎర్రగుంట్ల
2. హెల్తీ పంచాయతీ	హలహర్వి, మహదేవపురం, యూ. బొల్లవరం
3.చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ	గంగవరం, రామాపురం,ఎల్లమ్మగుంట తండా
4. వాటర్ సఫిషియంట్ పంచాయతీ	బహ్మణపల్లె, రామకృష్ణాపురం, ఐ.కొత్తపేట
5.క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ	బనగానపల్లె, పాండవగళ్లు, సిరివెళ్ల
6.సెల్ఫ్ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పంచాయతీలు	మాంత్రికి, పాణ్యం, సంతనూరు
7. సోషల్లీ సెక్యూర్డ్ పంచాయతీ	కానాల, మండగిరి, పలుకూరు
8. గుడ్ గవర్నెన్స్ పంచాయతీ	సిమెంట్ నగర్, ఆలమూరు, వీరుపాపురం
9. ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ	బనగానపల్లె, మ్యాకడోనా, గుడుంబాయి తండా

అందరి సహకారంతోనే అవార్డు



అందరి సహకారంతో ఉత్తమ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గా పాణ్యం గ్రామ పంచాయతీ ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఏ చిన్న సమస్య వచ్చినా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రోజుల వ్యవధిలోనే పరిష్కారానికి కృషి చేస్తున్నాం. సిబ్బంది, అధికారులు విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతి ఇంటికీ ఆరోగ్యం, డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి, సురక్షిత మంచినీరు, వనరుల వినియోగం, వర్మీకంపోస్టు తయారీ కేంద్రం నిర్వహణ, పన్ను వసూళ్ల లక్ష్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించి గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.

– మేకల పల్లవి, పాణ్యం, మేజర్ గ్రామ పంచాయతీ

నేడు ఆలయ భూముల వేలం

ఓర్వకల్లు: ఓర్వకల్లులో వెలసిన శ్రీచెన్నకేశవ, ఆంజనేయ, శ్రీరామ, నాగేశ్వరస్వామి దేవస్థానాలకు చెందిన 186 ఎకరాల భూములను ఏడాది పాటు కౌలుకు సాగు చేసుకునేందుకు సోమవారం స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శేషఫణి ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

కర్నూలు (న్యూటౌన్): గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ×స్పందన¥ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా గురుకులం ప్రవేశ పరీక్షలు


సి.బెళగల్ గురుకులం ప్రవేశ పరీక్ష కేంద్రం వద్ద కోలాహలం

సి.బెళగల్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు. పాఠశాలలో ఉదయం జరిగిన ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 766 మంది విద్యార్థులకు గాను 702 మంది హాజరు కాగా, 64 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సర ప్రవేశానికి 436 మందికిగాను 409 మంది హాజరు కాగా 27 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు అధికారులు 766 మందికి ఏర్పాట్లు చేయగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు, సహాయకులతో భారీగా తరలిరావడంతో సి.బెళగల్ బస్టాండ్, గురుకుల పాఠశాల సందడిగా మారింది. ఆరేకల్ గురుకుల పాఠశాల అధ్యాపకుడు దౌలత్ పరీక్షలకు పరిశీలకుడిగా వ్యవహరించారు. స్థానిక ఎస్ఐ పీరయ్య ఆధ్వర్యంలో 15 మంది పోలీసు సిబ్బంది పరీక్షల బందోబస్త్‌ను నిర్వహించారు.

సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి సూచించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని దివ్యాంగ చిన్నారులకు బాల్, ప్యాడ్స్ తదితర పరికరాలపై ముడుచుకపోయిన కాళ్లకు, చేతులకు వ్యాయామం చేయిస్తారని అన్నారు. అలాగే ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు, బధిరులకు ఐఈఆర్‌టీ పరికరాలతో విద్య అందిస్తారని తెలిపారు.

ఘనంగా బసవేశ్వర జయంతి


బసవేశ్వర జయంతి వేడుకల్లో కమిటీ ప్రతినిధులు, భక్తులతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: స్థానిక ఈశ్వర వీరభద్రస్వామి దేవాలయంలో కల్యాణ బసవేశ్వరుడి 892వ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ నిర్వహణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ నరసింహులు, నాయకులు రంగప్ప, చిన్న తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి


ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): గూడూరు పట్టణంలో బీసీ కాలనీవాసులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హామీఇచ్చారు. ఆదివారం గూడూరు పట్టణ ప్రజలు ఎమ్మెల్యే నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో బీసీలకు కమ్యూనిటీ హాల్ లేక ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే.. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. అనంతరం వారు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

తుది దశకు సచివాలయ భవన నిర్మాణం


పూర్తి కావొస్తున్న సచివాలయ భవనం పనులు

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో సచివాలయ భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. గ్రామంలో ఐదు వేల జనాభా ఉండటంతో ప్రభుత్వం రెండు సచివాలయాలను మంజూరు చేసింది. ఇప్పటికే ఒక సచివాలయ భవనం పూర్తి కావడంతో అధికారులు వినియోగంలోకి తెచ్చారు. రెండవ సచివాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.35 లక్షల నిధులు మంజూరు చేయండతో కాంట్రాక్టర్ దొల పనులు చేపట్టారు. అధికారుల చొరవ కారణంగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం సచివాలయ భవన నిర్మాణ పనులు 90 శాతం వరకు పూర్తి కాగా పెయింటింగ్, తలుపులు, బండ బరుపు వేయడం వంటి పనులు జరగాల్సింది. నెల రోజుల్లో మిగతా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని పీఆర్ ఏఈ గోపాల్‌రావు తెలిపారు.


వ్యవసాయ నీటి తొట్టిలో జలకాలాడుతున్న బాలురు

ఈత సరదా

కోడుమూరు: వ్యవసాయ నీటి తొట్లు చిన్నారులకు వేసవి తాపాన్ని తీరుస్తున్నాయి. ఎండలకు తట్టుకోలేక పలువురు బాలలు పొలాల్లో ఉన్న నీటితొట్లలో గంటల తరబడి ఈత కొడుతూ గడుపుతున్నారు. ఆదివారం ఎర్రదొడ్డి గ్రామశివారులోని వ్యవసాయ నీటి తొట్టిలో చిన్నారులు ఈత కొడుతూ ఆహ్లాదంగా గడుపుతున్న దృశ్యమిది.

అభివృద్ధి పరుగులు

- 29వ వార్డులో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు


సప్తగిరి కాలనీలో నూతనంగా వేసిన సీసీ రోడ్డు


ఉద్యోగనగర్ కాలనీలో వేసిన సీసీ రోడ్డు

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని వార్డులు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయి. చాలా ఏళ్ల తరువాత కర్నూలు నగర పాలక సంస్థ పాలక వర్గం ఏర్పడడంతో ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వాలు ఓటమి భయంతో నగర పాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో నగర ప్రజలు ఇబ్బందులు గురయ్యేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థలకు, నగర పాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించింది. కర్నూలు నగర పాలక వర్గం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయ్యింది. పాలక వర్గం వచ్చాక తమ సమస్యలు సకాలంలో పరిష్కారమవుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పథంలో 29వ వార్డు

కల్లూరు అర్బన్ పరిధి 29వ వార్డులోని కాలనీలలో సుమారు 20 వేల మంది జనాభా నివశిస్తున్నారు. పాలకవర్గం ఎర్పడ్డాక సుమారు రూ.3 కోట్లతో ఆయా కాలనీలో ప్రాధాన్యతలను అనుసరించి మౌలిక వసతుల కల్పనతో పాటు, వివిధ అభివృద్ధి పనులు చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు మొత్తం రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం చేశారు. అందులో వెంకటేశ్వర నగర్‌లో డ్రైనేజీ నిర్మాణానికి రూ.20 లక్షలు, గట్టయ్య నగర్‌లో డ్రైనేజీల నిర్మాణానికి రూ.20లక్షలు, సవారితోటలో రోడ్లు, కాలువ నిర్మాణానికి రూ.20 లక్షలు, రుక్మిణీనగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు రూ.20లక్షలు ఖర్చు చేసి ఆయా కాలనీలను అభివృద్ధి చేశారు. దీంతో ఆయా కాలనీలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– విజినగర్ కాలనీ ఏర్పడి సుమారు 35 ఏళ్లు అవుతున్నా కాలువలు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్థానిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పాలక వర్గం వచ్చిన వెంటనే మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులు రూ.20 లక్షలతో మొదటిసారిగా డ్రైనేజీలు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే సహకారంతో వార్డులో అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సహకరంతో వార్డులో ప్రాధాన్యతలను అనుసరించి అభివృద్ధి పనులు చేపడుతున్నాం. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.80 లక్షలతో పాటు మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా సుమారు రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, డబ్ల్యూబీఎం రోడ్లు వేశాం. రాబోయే రోజుల్లో వార్డును మరింత పురోగతిలోకి తీసుకెళ్తాం.

– సంగాల సుదర్శన్‌రెడ్డి, 29వ వార్డు కార్పొరేటర్

ఇబ్బందులు తప్పాయి



గతంలో సప్తగిరి కాలనీలో సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడ్డాము. వర్షకాలంలో రోడ్లు బురదమయంగా మారడంతో వాహనాలు స్కిడ్ అయి చాలా మంది కింద పడిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం సీసీ రోడ్డు వేయడంతో ఇబ్బందులు తప్పాయి.

– వెంకటేశ్వర్లు, సప్తగిరి కాలనీ.

శరవేగంగా అదనపు గదుల నిర్మాణం


చనుగొండ్లలో నిర్మితమవుతున్న తరగతి గదులు

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండవ విడత నాడు–నేడు కింద పాఠశాల అభివృద్ధిలో బాగంగా ప్రభుత్వం రూ.60 లక్షలకు పైగా నిధులను మంజూరు చేసింది. దీంతో హెచ్‌ఎం, స్కూల్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో అదనపు గదుల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ గది, అదనపు తరగతి, మినరల్ వాటర్ గది వంటివి నిర్మితమవుతున్నాయి. నెల రోజుల్లో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికి గదులను అందుబాటులోకి తెస్తామని ఎంఈఓ సునీలమ్మ తెలిపారు.

ప్రగతి పథంలో పల్లెలు



బస్తిపాడులో బురదమయంగా ఉన్న రోడ్డు (నాడు), బస్తిపాడు ఎస్సీ కాలనీలో వేసిన సీసీ రోడ్డు (నేడు)



కె.మార్కపురంలో దేవాలయం వద్ద వేసిన సీసీ రోడ్డు

కల్లూరు: జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోంది. అందుల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువ చేస్తూ గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఆయా కార్యాలయాల్లో 11 మంది సిబ్బంది వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.

మండల నిధులతో అభివృద్ధి పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక మండల నిధులతో వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపటారు. ముఖ్యంగా ప్రాధాన్యతలను అనుసరించి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రావెల్‌తో రోడ్లు వేశారు. కె.మార్కపురంలో కె.నాగలాపురం రోడ్డు నుంచి ఎల్లమ్మ దేవాలయం వరకు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, ఎ.గోకులపాడులో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు, సల్కాపురంలో రూ.8లక్షలతో గ్రావెల్ రోడ్డు, నెరవాడలో రూ.4 లక్షలతో సీసీ రోడ్డు, బస్తిపాడులో రూ.5లక్షలతో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, కొంగనపాడులో రూ.6లక్షలతో సీసీ రోడ్డు, చిన్నటేకూరులో రూ.3లక్షలతో, పెద్దటేకూరులో రూ.2లక్షలు, దొడ్డిపాడులో రూ.2లక్షలు, బొల్లవరంలో రూ.2లక్షలు, రెమడూరులో రూ.4లక్షలతో గ్రావెల్ రోడ్లు, నాయకల్లులో రూ.6 లక్షలతో మెయిన్‌రోడ్డు, కల్వర్టు నిర్మాణం, కొల్లంపల్లి తాండలో రూ.3.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు.

ప్రయాణ ఇబ్బందులు తొలగాయి



కె.నాగలాపురం రోడ్డు నుంచి గ్రామ సమీపంలో ఉన్న ఎల్లమ్మ దేవాలయం వరకు సీసీ రోడ్డు నిర్మించడం సంతోషంగా ఉంది. గతంలో దేవాలయనికి వచ్చే ప్రజలు, వాహనాదారులు చాలా ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం రోడ్డు వేయడంతో గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల ఇబ్బందులు తొలగాయి.

– తిప్పన్న, కె.మార్కపురం

వెండి పడిగె వితరణ


ఈఓ రామకృష్ణకు వెండి పడిగె అందజేస్తున్న తమ్మినేని నరసింహులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి వారికి దాతలు వెండి పడిగెను బహుకరించారని ఈఓ రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. బేతంచెర్లకు చెందిన తమ్మినేని నరసింహులు, సతీమణి రజినీకుమారి, కుటుంబ సభ్యులు కేజీ వెండితో పడిగెను తయారుచేయించి స్వామి వారికి బహుకరించినట్లు చెప్పారు. దాతల కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామివారి శేషావస్త్రాలు అందించి ప్రత్యేక పూజలు చేయించినట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.